సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

మహారాణిపేట: రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆరోగ్య విద్య ప్రచార, మీడియా విస్తరణ అధికారులు సమకూర్చిన 2024 క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ జగదీశ్వర ప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ సామాజిక చైతన్య సభ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో ఓబీసీ మోర్చా బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించనున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి ఈ సభ జరగనుంది. ఈ సభలో ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి కె.సత్యకుమార్ అతిథులుగా పాల్గొననున్నారు.

సాయి భజనలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో పాత వెంకోజీపాలెంలో శ్రీ సీతారామాలయం లోని ద్వారకమయి భక్త బృందం వారిచే శనివారం నిర్విరామంగా 12 గంటల పాటు సాయి భజనల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సాయి నామస్మరణతో భజన కీర్తనలను ఆలపించి భక్తి పారవశ్యంలో ముగినితేలారు. ఆలయ ప్రధాన అర్చకులు రంపా రామ్మోహన శర్మ, బొడ్డేటి సూర్యనారాయణ, అధ్యక్షుడు విశ్వనాథం పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం



క్రీడల్లో శిక్షణ ఇస్తున్న కోచ్‌లకు చెక్కు అందజేస్తున్న అపోలో వైద్యులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అపోలో వైద్యుల సొసైటీ ఆర్థిక సాయం అందించింది. దీనికి సంబంధించి రూ.లక్ష చెక్కును శనివారం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అపోలో సొసైటీ వైద్యులు ఆరిలోవ సీఐ సోమశేఖర్ సమక్షంలో క్రీడల కోచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా అపోలో డాక్టర్ల సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బారువ మాట్లాడుతూ పిల్లలకు క్రీడలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో అపోలో డాక్టర్స్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ రాజేష్ వెంకట్, సభ్యులు డాక్టర్ వర్మ, డాక్టర్ రమా, కోచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో పాత వెంకోజీపాలెంలో 4 రోడ్ల జంక్షన్ వద్ద అభివృద్ధి పనులకు శనివారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావులు వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్, ఎంపీలు మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత గన్నమనేని వెంకటేశ్వరరావు , చొల్లంగి నాగేశ్వరరావు, పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో శ్యామల దేవి (60) గుండెపోటుతో మృతి చెందింది. కురుమాం మార్కెట్ సమీపంలో వృద్ధురాలు ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటుంది. స్థానికుల సాయంతో ఆమె మృతి చెందిన విషయాన్ని పోలీసులకు తెలిసింది. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606



బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన కొబ్బరి చెట్లు



అందాల విశాఖ ఆర్కే బీచ్



కళకళలాడుతున్న ఆర్కే బీచ్ రహదారి

ఆహా... ఆర్కే బీచ్

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి
- ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునేలా

ఫుట్‌పాత్‌ల విస్తరణకు రూ.47.29 లక్షలు	మరుగుదొడ్ల అభివృద్ధికి రూ.48 లక్షలు
స్మార్ట్ టాయిలెట్స్ నిర్మాణం రూ 20 లక్షలు	పచ్చదనం పెంపునకు రూ.2 కోట్లు
బీచ్‌రోడ్డు అభివృద్ధి : రూ. కోటి	

బీచ్‌రోడ్డు: ఆర్కేబీచ్..ఈ పేరు తెలియని వారుండరు. ఆర్కేబీచ్ అంటే సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ఇష్టపడే ప్రాంతం. దేశవిదేశాల నుంచి ఎవరు విశాఖ వచ్చినా ఆర్కేబీచ్‌ను టచ్ చేయకుండా వెళ్లరు. అటువంటి ఆర్కేబీచ్‌ను మరింత ఆకర్షణీయంగా..ఆహ్లాదంగా మార్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. నాలుగున్నర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అత్యధిక నిధులు కేటాయిస్తూ రూపురేఖలు మార్చేశారు. కోట్లాది రూపాయలతో చేసిన అభివృద్ధి అడుగడుగునా కనిపిస్తోంది. ఆర్కేబీచ్ నుంచి పార్క్ హోటల్ వరకు అంతర్జాతీయ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అనేక మార్పులు చేర్పులు చేసింది. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నిరంతరం అభివృద్ధి పనులు చేస్తూ ఆకర్షిస్తోంది.

నాలుగేళ్లలో రూ.4 కోట్లతో మరమ్మతులు

ఆర్కేబీచ్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు బీచ్‌ను మరింత అందంగా తీర్చిదిద్దేందుకుగాను నాలుగేళ్లలో జీవీఎంసీ విభాగం మాత్రమే రూ. 4 కోట్లు ఖర్చు చేసింది. వీటిలో రోడ్డు మరమ్మతులు, ఫుట్‌పాత్, మొక్కలకు భద్రత, మరుగుదొడ్ల మరమ్మతులు, భద్రత గోడ వంటివి ఉన్నాయి.

ఫుట్‌పాత్ విస్తరణ

సాగరతీరంలో వచ్చిన వారిలో చాలా మంది సాయంత్రం సమయంలో బీచ్ వాక్ చేస్తుంటారు. దీనితో ఫుట్‌పాత్ ఎప్పుడు రద్దీగా ఉంటుంది. దీంతో పర్యటకులకు నడిచేందుకు ఇబ్బందులు ఉండేవి. జీవీఎంసీ రూ.47.29 లక్షలతో ఫుట్‌పాత్‌ను విస్తరించింది. అంతేకాకుండా వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా ద్విచక్ర వాహనాలు ఫుట్‌పాత్‌పై నుంచి వెళ్లకుండా ఉండేందుకు భద్రత గార్డులను సైతం ఏర్పాటు చేశారు.



మొక్కలకు గ్రిల్స్ ఏర్పాటు



ఫుట్‌పాత్‌పై ద్విచక్రవాహనాలు వెళ్లకుండా...

మరుగుదొడ్లకు మరమ్మతులు

పర్యటకులకు ఆకర్షించాలంటే ముందుగా వారికి మంచి సౌకర్యాలను కల్పించాలి. ముఖ్యంగా మరుగుదొడ్లు చాలా అవసరం. వీటి కోసం నాలుగేళ్లలో జీవీఎంసీ రూ.48 లక్షలు ఖర్చు చేసింది. అంతేకాకుండా రూ.20 లక్షలతో స్మార్ట్ టాయిలెట్స్ నిర్మించింది.

పచ్చదనం..భద్రత

అందమైన సముద్రం..మరింత అందంగా కనిపించాలంటే పచ్చదనం చాలా అవసరం..ఇందుకు హార్టికల్చర్ విభాగం ఎప్పటికప్పుడు మొక్కలు నాటుతుంటారు. అయితే వాటికి సరైన భద్రత ఉండేదికాదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జీవీఎంసీ రూ.2 కోట్లతో మొక్కలకు గ్రిల్స్‌ను ఏర్పాటు చేసింది. దీనితో నిరంతరం పచ్చదనం ఉండేలా, పశువులు నుంచి రక్షణగా ఈ గ్రిల్స్ ఉపయోగపడుతున్నాయి..

రహదారుల కళకళ

ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఉన్న రోడ్డు గుంతలు లేకుండా మరమ్మతులను జీవీఎంసీ చేపట్టింది. అలాగే తీర ప్రాంతం రక్షణ గోడ మరమ్మతులు కూడా చేపట్టింది. నాలుగేళ్లలో రూ.కోటి ఖర్చు చేసింది. దీని వలన తీరంలోని రోడ్లు అందంగా, శుభ్రంగా కనిపిస్తున్నాయి.

కొబ్బరి చెట్లు ఏర్పాటు

గోవా తరహా బీచ్‌లుగా అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ సన్ రే రిసార్ట్స్ సహకారంతో ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు కొబ్బరి చెట్లును ఏర్పాటు చేసింది. అలాగే రాత్రి సమయంలో అందంగా కనిపించేందుకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా సముద్రపు అలల నుంచి రక్షణగా పెద్ద రాళ్లను కొబ్బరి చెట్ల ముందు ఏర్పాటు చేసింది. కొబ్బరి చెట్లు ఏర్పాటుతో మధ్యాహ్నం సమయంలో కూడా సందర్శకులు బీచ్‌లో ఎంజాయ్ చేయడానికి అవకాశం కలిగింది.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో..

సాగరతీరాన్ని జీవీఎంసీ నిధులతోనే కాకుండా స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కూడా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. ఇందులో భాగంగా సోలార్ విద్యుత్ దీపాలు, ప్లాస్టిక్ రహిత ప్రకటన కోసం డిజిటల్ స్క్రీన్లు, స్మార్ట్ బస్సు స్టాప్ ఏర్పాటు చేసింది. దీంతో తీరంతో ఎంతో అందంగా ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

ఇది కదా అభివృద్ధి



బీచ్ రోడ్డులో సోలార్ వెలుగులు

జయహో జగన్



లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీ, కార్పొరేటర్ విజయసాయి



12వ వార్డులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రోహిణి, లబ్ధిదారులు

ఆరిలోవ: వృద్ధాప్య, వితంతువుల పింఛను ఈనెల నుంచి రూ.3,000కు పెంచడంతో లబ్ధిదార్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 12వ వార్డులో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వార్డు పరిధి పోలీస్ స్టేషన్ వెనుక సచివాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.3వేలు పెంచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, అర్జున్, మౌళి, సూర్యారావు, సత్యనారాయణ, కొండమ్మ, మోహన్, జ్యోతి ప్రకాష్, గాయత్రి, రాజు, శ్రీను, రమణ, పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మద్దిలపాలెం: ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.3వేలు పెంచి పేదల హృదయాల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి గూడుకట్టుకున్నారని 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి పేర్కొన్నారు. 23 వార్డులో పెరిగిన రూ.3వేలు పింఛన్లను లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ నేత జీవీ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు,సత్యారెడ్డిలతో కలిసి విజయసాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆడుకుందాం ఆంధ్రా టీ షర్టులు, టోపీలు, క్రికెట్ కిట్లు, షటిల్ కిట్లను క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటర్లు, పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పెన్షన్ అందించి..



డయాలసిస్ రోగి నాగేశ్వర రావుకు ఆస్పత్రిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీలక్ష్మి

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులో నివాసం ఉంటున్న మండ నాగేశ్వర రావు కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ కె.శ్రీలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ డబ్బులను నాగేశ్వర రావుకు అందించారు.

చార్టెడ్ అకౌంటెంట్స్ కార్యాలయం ప్రారంభం



వెంకటేశ్వర రావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు చిన్మయ మార్గ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకట్ శ్రీనివాస్ అండ్ కో చార్టెడ్ అకౌంటెంట్స్ కార్యాలయం ప్రారంభోత్సవానికి వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆడిటర్ జి.వెంకటేశ్వర రావు (జీవీ)ని అభినందించారు. అదేవిధంగా మేయర్ జి.హరి వెంకట కుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొని జీవీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్లు ఎ.శ్రీనివాస్, కేవీటీ కార్తీక్, ఎ.సత్యదేవ్, ఎస్‌వైకే కిషోర్, ఎ.సాయి చక్రధర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నవరత్నాలు



ప్రభుత్వ పథకాలు లబ్ధిని తెలుసుకొంటున్న తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ

ఆరిలోవ: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన అందరికీ నవరత్నాలు పేరుతో సంక్షేమపథకాలు అందిస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 11వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఆ పార్టీ స్థానిక నాయకులతో కలిసి 19 నంబర్ సచివాలయం పరిధిలో గాంధీనగర్, కృష్ణానగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిపొందినవారంతా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యంతో బాలికలు ముందడుగు వేయాలి



మాట్లాతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ

ఆరిలోవ: బాలికలు జీవితంలో సాధించాల్సిన లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ సూచించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరిలోవ పోలీసులు ఆధ్వర్యంలో శనివారం బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా వైద్యులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, దిశ పోలీసులు పాల్గొని బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఆడపిల్లగా పుట్టడం ఎంతో అదృష్టమన్నారు. ఆడపిల్లకే ఎంతో పవిత్రమైన అమ్మ పాత్ర లభిస్తుందన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరడానికి ఆడ పిల్లలు సమాజంలో చాలా జాగ్రతలు పాటించాల్సి ఉందన్నారు. పురుషులు చెప్పే మాయమాటలకు దూరంగా ఉండి చదువు మీదే ధ్యాస పెట్టాలని ఆమె సూచించారు. అనంతరం దిశ పోలీస్ విభాగం సీఐ నిర్మల మహిళా చట్టాలను వివరించారు. అపోలో వైద్యులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బాలికల ఆరోగ్య సమస్య, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలికలు , పాఠశాల ప్రధానోపాధ్యాయిని దుర్గాభవాని, ఆరిలోవ సీఐ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలు ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జనవరి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. https:// ignouadmission. samarth. edu. in/ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

బీచ్‌రోడ్డు: దేశంలో 56 శాతం ఉంటున్న బీసీలను బీజేపీ దూరం చేసుకోకుండా ఉండాలంటే చట్టసభలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణు మాధవ్ అన్నారు. శనివారం బీచ్‌రోడ్డులోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగాల శ్రీనివాస్ కలిశారు. ఈ సందర్భంగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే విధంగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు బీజేపీ నాయకులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో 56 బీసీ కులాల కార్పొరేషన్ బీజేపీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బారాయుడు, మన్యం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప పరిశోధనశాలి డాక్టర్ రేవూరి



రేవూరి అనంత పద్మనాభరావు రచనలు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మద్దిలపాలెం: కథకులు, నవలా రచయిత, అనువాద విమర్శకులైన డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు గొప్ప పరిశోధనశాలి, పట్టుదల గల వ్యక్తి అని ఆచార్య వెలమల సిమ్మన్న అన్నారు. శనివారం కళాభారతి ఆడిటోరియంలో అజో-విభో-కందాళం, రైటర్స్ అకాడమి నిర్వహించిన విశిష్ట సాహితీ సభలో సాహితీ మూర్తి పురస్కార గ్రహీత డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు కృషిని వివరించారు. రేవూరి తాళాపత్రిక గ్రంథాలను కూడా రావు చూశారన్నారు. సభ అధ్యక్షత వహించిన మహారాజా సంస్కృతి కళాశాల పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఆయల సోమయాజులు మాట్లాడుతూ ఆంధ్రదేశంలో పాటు కర్నాటకలో కూడా రేవూరి అష్టవధానం నిర్వహించారని గుర్తు చేశారు. కాకరపర్తి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రసార ప్రముఖుల గురించి ప్రసంగించారు. కందళం వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ 60 ఏళ్ల రేవూరి సాహిత్యంలో విశిష్ట కృషి చేశారన్నారు. వ్యాకరణపై ఆయన మంచి రచనలు చేశారన్నారు అనంతం పద్మనాభరావు రచనల సంపుటి వేదిక ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న నాటిక పోటీలు

మూడోరోజు కళాభారతిలో ప్రదర్శించిన నాటిక పోటీలను అందరిని ఆకట్టుకున్నాయి. ముందుగా ఆకెళ్ల శివప్రసాద్ మూల కథతో గోపి సత్యప్రకాష్, నాటీకరణ చేసిన గోపరాజు విజయ్ దర్శకత్వం వహించిన తెలుగు కౌలస్య సుప్రజా రామా నాటికను ప్రదర్శించారు. రెండో ప్రదర్శనగా వీరన్న పాలెంకు చెందిన కళానికేతన్ బృందం రాజు గారి గోచి ప్రదర్శించారు. మూడో నాటికగా మళ్లీ కలిసి జీవిద్దాం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రైటర్స్ అకాడమి చైర్మన్ వీవీ రమణమూర్తి, ఆచార్య మలయవాసిని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



లారి ఢీకొట్టిన ప్రమాదంలో మృతిచెందిన నాగమణి

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్‌లో శనివారం ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలపాలేనికి చెందిన శీలం నాగమణి(40) భర్త శ్రీనివాసరావుతో ద్విచక్రవాహనంపై రావులపాలెం వెళ్లేందుకు బయలుదేరారు. ఎన్ఏడీ జంక్షన్ వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైకు అదుపుతప్పడంతో వెనుక కూర్చున్న నాగమణి కిందకు పడిపోయింది. దీంతో లారీ చక్రాల కిందకు వెళ్లడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఘటనా స్థలానికి చేరకుని ప్రమాద వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మళ్ల అప్పారావు దర్యాప్తు చేపట్టారు.

ఏయూను సందర్శించిన రూసా ప్రాజెక్ట్ డైరెక్టర్



పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న వీసీ సమత

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రూసా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోల భాస్కర్ శనివారం సందర్శించారు. ఏయూలో రూసా 2.0 పథకంలో భాగంగా నిర్మించిన ఎలిమెంట్ భవనంతో పాటు పలు భవనాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏయూ సొంతంగా పర్యవేక్షణ జరుపుతూ అత్యంత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణాలు చేయడాన్ని అభినందించారు. ఏయూ జరిపిన నిర్మాణాలను ఇతరులకు సైతం ఆదర్శంగా నిలుస్తాయన్నారు. అనంతరం ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమతతో కార్యాలయంలో డాక్టర్ పోల భాస్కర్ సమావేశమయ్యారు. రూసా నిధులను సద్వినియోగం చేస్తూ ఏయూ చేసిన పటిష్ట నిర్మాణాలపై సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో మిగిలిన రూసా బిల్లులకు సంబంధించిన నిధులను సైతం విడుదల చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఏయూ తరపున డాక్టర్ పోల భాస్కర్‌ను వీసీ ఆచార్య కె.సమత సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్ ఆచార్య కె.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు ప్రారంభం

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు జరగనున్న ఈ సంబరాలను పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, ఆనందపురం వ్యవసాయదారుడు దొంతల బంగార్రాజు, పాఠశాల ఉపాధ్యాయులుతో కలిసి గాలి పటాలు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ విద్యార్థులు గంగిరెద్దులు, పిట్టలు దొరలు, హరిదాసు వేషధారణలో అలరించారు. రామాయణం, పువ్వులు మనోభావాలు, సాంప్రదాయ వస్త్రాలు తదితరవాటి గురించి తెలియజేసే నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న పైడిరాజు

మర్రిపాలెం: మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు రైల్వే గ్రౌండ్స్‌లో జరిగాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో సాగర్‌నగర్‌కు చెందిన కనకల పైడిరాజు 800 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్ రేస్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించారు. షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుపొందారు. ఈ పోటీల్లో విశాఖ జిల్లాతోపాటు కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, వరంగల్, అల్లూరి జిల్లాలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అడ్వైజర్ సందర రామరాజు, బీజేపీ నాయకుడు మాధవ్ విజేతలకు ట్రోఫీ, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. గీతం దంత వైద్యశాల ప్రిన్సిపాల్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

